గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు



కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టికి మెమోరాండం అందజేస్తున్న గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్‌: గోషామహల్‌ పోలీస్‌ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించవద్దని గోషామహల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్‌ డి.గోపాల్‌ జీ కోరారు. ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేస్తూ కార్పొరేటర్లు లాల్‌సింగ్‌, రాకేశ్‌ జైస్వాల్‌, బీజేపీ నాయకులు దాసరి చంద్రశేఖర్‌, సంజయ్‌కుమార్‌, నితిన్‌ నందకర్‌, కాంగ్రెస్‌ నేత సతీశ్‌తో కలిసి హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టికి శుక్రవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతంలోనే మళ్లీ ఆసుపత్రిని నిర్మించవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ స్పందించి ప్రజల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

కుడా స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించండి



ఎమ్మెల్యే రాజాసింగ్‌

అబిడ్స్‌: పాతబస్తీ కుడా స్టేడియం లేదా మలక్‌పేట ప్రభుత్వ క్వార్టర్స్‌ ప్రాంతంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించాలని గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. గోషామహల్‌ గ్రౌండ్స్‌ పరిసరాల్లో లక్షలాది ప్రజలు జీవిస్తున్నారన్నారు. అక్కడ ఆసుపత్రి నిర్మిస్తే వారికి ఇబ్బందులు తప్పవన్నారు. ఉస్మానియా ఆసుపత్రిని అఫ్జల్‌గంజ్‌లోని ప్రస్తుత ఆసుపత్రి ఆవరణ లేదా కుడా స్టేడియం, మలక్‌పేట్‌ పోలీస్‌ క్వార్టర్స్‌ ప్రాంతంలో ఎక్కడైనా నిర్మించాలని విన్నవించారు. గోషామహల్‌ స్టేడియంలో స్థానిక ప్రజలు, యువత కోసం మరిన్ని క్రీడా సౌకర్యాలు కల్పించాలన్నారు. గోషామహల్‌ గ్రౌండ్స్‌ను శిక్షణ, యోగా, ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ లాంటి కార్యకలాపాలకు ఉపయోగిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్‌ వ్యవస్థను మెరుగుపర్చాలి



టీజీఎస్‌పీడీసీఎల్‌ ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌ తదితరులు

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గంలో విద్యుత్‌ వ్యవస్థను మెరుగుపర్చడమే కాకుండా ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ కోరారు. ఈమేరకు బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్‌ ముబీన్‌తో కలిసి టీజీఎస్‌పీడీసీఎల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ముషార్రఫ్‌ అలీని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోలిచౌకీ సూర్యనగర్‌ కాలనీలో విద్యుత్‌ కార్యాలయం ప్రారంభించారని అయితే ఏఈ, ఫీల్డ్‌ ఆపరేషన్స్‌ సిబ్బందిని నియమించలేదన్నారు. పదేళ్లుగా విద్యుత్‌ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అధికారులు అంతంత మాత్రంగానే మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్నారు. దశాబ్దాల క్రితం వేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, అంతేగాకుండా వాటి చుట్టూ కంచెలు లేవని దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యాలయాల్లోని అసిస్టెంట్‌ ఇంజినీర్లు బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో వేరేవారిని నియమించాలన్నారు. మేనేజింగ్‌ డైరెక్టర్‌ స్పందించి ఫీల్డ్‌ రిపోర్టు తెప్పించుకుని అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌ తదితరులు ఉన్నారు.

మజ్దూర్‌ యూనియన్‌ విజయోత్సవ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న రైల్వే కార్మికులు

నాంపల్లి: రైల్వే ఎన్నికల్లో సికింద్రాబాద్‌ డివిజన్‌లో 2,663 ఓట్ల మెజార్టీ, అలాగే దక్షిణ మధ్య రైల్వేలో 32,507 ఓట్ల మెజార్టీతో మజ్దూర్‌ యూనియన్‌ గెలుపొందడంపై ఆ యూనియన్‌ కార్మికులు హైదరాబాద్‌ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌ జనరల్‌ బ్రాంచ్‌, సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచి సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు మజ్దూర్‌ యూనియన్‌ జెండాలను పట్టుకుని రైల్వేస్టేషన్‌ ప్రాంగణంలో ర్యాలీ చేపట్టారు. హైదరాబాద్‌ జనరల్‌ బ్రాంచ్‌ కార్యదర్శి ఆర్‌జీ.బరాటే, కోశాధికారి ఆకుల శ్రీనివాస్‌, సీఅండ్‌డబ్ల్యూ కార్యదర్శి ఎ.వర ప్రసాద్‌, చైర్మన్‌ ధర్మరాజు, నేతలు ఫయాజ్‌, సంతోష్‌, ప్రకాశ్‌, ఏకే.సింగ్‌, మల్లేశం, ఆఫీస్‌ బేరర్లు, వర్కింగ్‌ కమిటీ సభ్యులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌తో కేక్‌ కట్‌ చేయిస్తున్న కార్పొరేటర్‌ వసీవుద్దీన్‌, బస్తీవాసులు

యాకుత్‌పురా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ అన్నారు. రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌తో కలిసి యాకుత్‌పురా ఈస్ట్‌ చంద్రనగర్‌, రైల్వేస్టేషన్‌ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానికులు ఆయనను సన్మానించి కేక్‌ కట్‌ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

'రైతులకు సంకెళ్లతో కాంగ్రెస్‌ ప్రభుత్వ పతనం ఆరంభం'



గుడిమల్కాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: రైతులకు సంకెళ్లు వేయించిన కాంగ్రెస్‌ ప్రభుత్వానికి పతనం ఆరంభం అయ్యిందని బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌ అన్నారు. లగచర్ల రైతులకు బేడీలు వేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గుడిమల్కాపూర్‌ చౌరస్తా వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాటి సీఎం కేసీఆర్‌ ఖమ్మం జిల్లా మిర్చి రైతులకు సంకెళ్లు వేశారని. ఆ పాపం ఫలితం కేసీఆర్‌ అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వ వేధింపులతో ఇప్పటికే ఎందరో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్‌ ఏడాది పాలనలో సీఎం రైతులను మోసం చేయడమే తప్ప ఎలాంటి మేలు చేయలేదని మండిపడ్డారు. రైతులకు అండగా ఉండేది.. వారికి సకాలంలో రుణసదుపాయం కల్పించేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముఖేష్‌సాగర్‌, సుధాకర్‌, శ్రీకాంత్‌సాగర్‌, సునీల్‌ బోలే, ఆకుల శ్రీకాంత్‌, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నాటకానికి ఉజ్వల భవిష్యత్‌

నాంపల్లి: రాష్ట్రంలో నాటకానికి ఉజ్వల భవిష్యత్‌ ఉందని ఇందుకు శివానీ పద్య నాటక పోటీలకు వస్తున్న స్పందనే నిదర్శనమని బీజేపీ యువ నాయకుడు డాక్టర్‌ వేముల లోకేష్‌ అన్నారు. శివానీ ఆర్ట్స్‌ అసోసియేషన్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆహ్వాన పద్యనాటక పోటీలు రెండో రోజు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో పోటీలు జరుగుతున్నాయి. ఆయన ముఖ్య అతిథిగా హాజరై నటీనటులను అభినందించారు. కార్యక్రమంలో శివానీ ఆర్ట్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ పాండవుల హరి ప్రసాద్‌, సలహాదారులు యిమ్మానేని శివన్నారాయణ పాల్గొన్నారు.



కళాకారులను అభినందిస్తున్న డాక్టర్‌ వేముల లోకేష్‌, తదితరులు

మెప్మా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మెప్మా కార్మికులు

నాంపల్లి: మెప్మా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మెప్మా రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత అన్నారు. ఈ మేరకు ఏసీగార్డ్స్‌లోని మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ కార్యాలయాన్ని శుక్రవారం మెప్మా కార్మికులతో కలిసి ముట్టడికి యత్నించారు. మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. దీంతో శాంతియుతంగా నిరసన తెలియజేసే అవకాశాన్ని కల్పించారు. అనంతరం మెప్మా అధికారికి వినతి పత్రం అందజేసి కార్మికులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. మెప్మా కార్మికులకు 7 నెలల వేతనాలు చెల్లించాలని, యూనిఫాం, ఆరోగ్య భద్రత, వారాంతపు సెలవులు ఇవ్వాలని, బీమా, ఇతర అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సుమారు 300 మంది మెప్మా కార్మికులు పాల్గొన్నారు. మెప్మా కార్మికులు మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ కార్యాలయం ముట్టడికి వస్తున్నారనే విషయం తెలుసుకున్న పోలీసులు ఉదయం 8 గంటలకే సదరు కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలం'



చార్మినార్‌: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర బీజేపీ అధికార మాజీ ప్రతినిధి మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీ అన్నారు. చార్మినార్‌ బీజేపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ ఏడాది పాలన వైఫల్యాలను నిరసిస్తూ నియోజకవర్గంలో గురువారం రాత్రి బైక్‌ ర్యాలీ నిర్వహించారు. సుల్తాన్‌ షాహి జగదాంబ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఘాన్సీబజార్‌, పురానాపూల్‌, శాలీబండ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం కార్నర్‌ మీటింగ్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో గోల్కొండ బీజేపీ అధ్యక్షుడు బీ పాండు యాదవ్‌, సీనియర్‌ నాయకులు ఓం ప్రకాశ్‌, టీ ఉమామహేంద్ర, ప్యారసాని వెంకటేశ్‌, శ్రీధర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో ఓ యువకుడు (30) పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులు లేదా 040–23202238 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ..



జియాగూడ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కుల్సుంపురా పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్‌ చౌరస్తా టీంకీబాద్‌ ఎదురుగా సాయంత్రం 6.30 గంటలకు ఓ వ్యక్తి పడి ఉన్నట్లు డయల్‌ 100కు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మద్యం తాగి ఉన్నాడని ఫిట్స్‌ రావడంతో అక్కడే చేపలు విక్రయించేవారు కాపాడే యత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతుడు వయస్సు 50 ఏళ్లకుపైగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా మృతుడు కామటిపురా పరిసర ప్రాంతానికి చెందిన వాడిగా పోలీసులు భావిస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై మృతదేహం



డబీర్‌పురా: ఫుట్‌పాత్‌పై మృతదేహం లభ్యమైన ఘటన మీర్‌చౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీ నాలా మాతాకి కిడికి ప్రాంతంలో మహ్మద్‌ ముస్తాఫా (60–65) గతంలో రిక్షా నడుపుకుంటూ ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుండేవాడు. కాగా కొన్ని రోజుల క్రితం రిక్షాను అమ్మేసి భిక్షాటన చేస్తున్నాడు. ఈ నెల 12న ఫుట్‌పాత్‌ ఛబుత్రాపై నిద్రించిన మహ్మద్‌ ముస్తాఫా మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

ఆర్‌.కృష్ణయ్యకు సన్మానం



కృష్ణయ్యను సన్మానిస్తున్న శంకర్‌, శివకుమార్‌

అఫ్జల్‌గంజ్‌: రాజ్యసభ సభ్యుడిగా నియమితులైన ఆర్‌.కృష్ణయ్యను తెలంగాణ మేరు యువజన సంఘం నాయకులు శుక్రవారం కలిశారు. ఆదిమూలం శంకర్‌, వెన్ను శివకుమార్‌, ప్రశాంత్‌కుమార్‌, పోల్కం వినయ్‌కుమార్‌ ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోల్కం శ్రీనివాస్‌ గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదత్తాత్రేయ జయంతి వేడుకలు



జియాగూడ: సీతారాంబాగ్‌ పహాడ్‌పై ఉన్న దత్తాత్రేయ ఆలయంలో శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలను ఈనెల 14 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్రినాథ్‌ సింగ్‌, కోశాధికారి ఠాకూర్‌ గోపాల్‌ సింగ్‌, కార్యదర్శి కృష్ణంరాజ్‌ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 14న ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు దత్తాత్రేయ స్వామి సుప్రభాత సేవ, 5.30 గంటలకు అభిషేకం, 7 నుంచి ఇతర దేవర్చన, శిఖర పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 15న సుప్రభాత సేవ, అభిషేకం, హారతి, దేవత్పరణ, ఉదయం 10 గంటలకు దత్తాత్రేయ డోలారోహణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నప్రసాద కార్యక్రమాలు చేపడుతామన్నారు. సాయంత్రం 6 గంటలకు మహా హారతి, అనంతరం పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వీరేందర్‌ సింగ్‌, కే సందీప్‌ సింగ్‌, అల్లు శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రి పనితీరు భేష్‌



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి పనితీరు అత్యుత్తమంగా ఉందని ఆరోగ్య శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పుష్ప అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం సందర్శించారు. ముందుగా ఫార్మసీని పరిశీలించారు. స్టాఫ్‌ రిజిస్టార్‌తో పాటు అన్ని సక్రమంగా ఉండడంపై సిబ్బందిని అభినందించారు. అనంతరం ఫైర్‌ సెఫ్టీ, వైద్య పరికరాలు, ఇతర విభాగాలను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయో హజర్డ్‌ నిర్వహణ శాస్త్రీయంగా ఉందన్నారు. అనంతరం ఆసుపత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పీవీ. శ్రీనివాసరావుతో సమావేశమై వైద్యులు, నర్సింగ్‌, సిబ్బంది తదితర వాటిపై చర్చించారు. ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్‌ వివరించారు. సీజనల్‌ వ్యాధులు నేపథ్యంలో ఔట్‌ పేషంట్ల సంఖ్య ఎక్కువగా ఉందని, వారికి కూడా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌ డీఎంహెచ్‌వో డాక్టర్‌ వెంకట్‌ తదితరులు ఉన్నారు.

తెలుగు భాష ఎంతో గొప్పది



విజేతలతో సుద్దాల అశోక్‌తేజ

సుల్తాన్‌బజార్‌: తెలుగు భాష ఎంతో గొప్పదని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌ తేజ అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మన సంస్కృతి సంస్థ తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల పురస్కారాల ప్రదానోత్సవంలో శుక్రవారం సాయంత్రం ఆయన పాల్గొని మాట్లాడారు. తమిళులకు తమిళ భాషపై ఉన్న ప్రేమ తెలుగు వాళ్లకు తెలుగుపై లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా తప్పు లేదని కానీ మాతృభాష తెలుగు మరువ రాదన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన తెలుగు, హిందీ పరీక్షల విజేతలకు ఆయన జ్ఞాపికలు, బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దైవాజ్ఞ శర్మ, ప్రొఫెసర్‌ పీవీఎల్‌ మాధవరావు, రూప్‌కుమార్‌ రెడ్డి, షేక్‌ మస్తాన్‌, అన్నమాచారి, అంకయ్య, మోహన్‌కుమార్‌, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



చార్మినార్‌: సినీ నటుల అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని చార్మినార్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ మాజీ ఇన్‌చార్జి కే వెంకటేశ్‌ మేరు అన్నారు. ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేశ్‌ జన్మదిన సందర్భంగా వెంకటేశ్‌ సేవా సమితి ప్రధాన కార్యదర్శి సుధీర్‌ కపూర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పెట్లా బుర్జ్‌లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో విక్టరీ వెంకటేశ్‌ సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌ కపూర్‌, ప్రతినిధులు రాజు వర్మ, ప్రవీణ్‌, దేవా తదితరులు పాల్గొన్నారు.

మిధానీ వర్కర్స్‌ అండ్‌ స్టాఫ్‌ యూనియన్‌ అధ్యక్షుడిగా శ్రీహరి

సంతోష్‌నగర్‌: శుక్రవారం జరిగిన కంచన్‌బాగ్‌లోని మిధానీ యూనియన్‌ ఎన్నికల్లో మిధాని వర్కర్స్‌ అండ్‌ స్టాఫ్‌ యూనియన్‌ అధ్యక్షుడిగా శ్రీహరి 22 ఓట్లతో ఘన విజయం సాధించారు. ఇందులో రోజ్‌ గుర్తు అభ్యర్థి శ్రీహరికి 205 ఓట్లు రాగా.. టైగర్‌ గుర్తు అభ్యర్థి నారాయణరావుకు 183 ఓట్లు, మజ్దూర్‌ యూనియన్‌ సంగ్‌ అభ్యర్థి సూర్యుడి గుర్తు అభ్యర్థి సురేశ్‌ రెడ్డికి 117 ఓట్లు రాగా.. 2 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. గెలుపొందిన శ్రీహరికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మిధానీ ఆవరణలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

నేడు గుట్టపోచమ్మ ఆలయంలో కార్యక్రమం

గోల్కొండ: షేక్‌పేట్‌లోని శ్రీ గుట్టపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఈనెల 14న (నేడు) 501 సభోసవం నిర్వహించనున్నట్లు కార్యక్రమ అధ్యక్షుడు ఎస్‌.లింగం నటేశ్వర్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీమత్‌ భగవద్గీత జ్ఞాన ప్రచార సమితి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణంలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్‌ డాక్టర్‌ విద్యాధర్‌ భట్‌ హాజరుకానున్నట్లు తెలిపారు.

వాటర్‌బోర్డు సమస్యలు పరిష్కరించండి



వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో వాటర్‌ బోర్డు సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ కోరారు. ఈ మేరకు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో శుక్రవారం సమావేశమై ఆయనకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం వాటర్‌బోర్డు సమస్యలను స్థానిక అధికారులకు వివరించినా పరిష్కారం కాలేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన నీటి సరఫరా చేయాలని కోరారు. ఎండీ స్పందిస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

నేటి జాతీయ లోక్‌ అదాలత్‌ను వినియోగించుకోవాలి

సిటీ కోర్టులు : నేటి జాతీయ లోక్‌ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని నాంపల్లి కోర్టు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్‌ సర్వీస్‌ అథారిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న లోక్‌ అదాలత్‌లో క్రిమినల్‌, సివిల్‌, యాక్సిడెంట్‌ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. న్యాయవాదులు కక్షిదారులకు లోక్‌ అదాలత్‌పై అవగాహన కల్పించి కేసులు పరిష్కరించే దిశగా కృషిచేయాలని ఆయన కోరారు.

'మంత్రివర్గంలో స్థానం కల్పించాలి'

చార్మినార్‌: మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ పాతబస్తీకి చెందిన సీనియర్‌ నాయకుడు సయ్యద్‌ అబ్దుల్‌ సమీ అతర్‌ శుక్రవారం పార్టీ అధిష్ఠానానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. 2014లో బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని పేర్కొన్నారు. పాతబస్తీ నాయకులకు సరైన ప్రాధాన్యత లభించడం లేదని, సీనియర్‌ నాయకులకు మంత్రి పదవి ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

అధికారమే లక్ష్యంగా కష్టపడాలి



సభ్యత్వ నమోదులో నాయకులు

చాంద్రాయణగుట్ట: రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని చాంద్రాయణగుట్ట బీజేపీ కాంటెస్టెడ్‌ ఎమ్మెల్యే కౌడి మహేందర్‌ అన్నారు. జంగమ్మెట్‌లో పార్టీ ఎస్టీ సెల్‌ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, విజయ్‌, జానీ, రాథోడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో హెచ్‌ఏఎల్‌ ఓపీ భవనం పనులు షురూ



స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

నాంపల్లి: నిలోఫర్‌లో హెచ్‌ఏఎల్‌ సీఎస్‌ఆర్‌ నిధులతో జీ+3 అంతస్తులతో నిర్మించే గైనకాలజి హెచ్‌ఏఎల్‌ ఓపీ బ్లాక్‌ నిర్మాణం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఓపీడీ బ్లాక్‌ పక్కన ఉండే పార్కింగ్‌ ఏరియాలో ఓపీ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ స్థలంలోని చెట్లను తొలగించి జేసీబీతో స్థలాన్ని చదును చేశారు. త్వరలోనే భూమిపూజ చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎన్‌.రవికుమార్‌ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



కేశవరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేశ్‌

గౌలిపురా: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్‌ సీనియర్‌ నేత కేశవరావును ఆ పార్టీ సీనియర్‌ నాయకుడు, చార్మినార్‌ నియోజకవర్గ పార్టీ మాజీ ఇన్‌చార్జి కే వెంకటేశ్‌ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కేశవరావును శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌ ముదిరాజ్‌, రాయబరపు కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



గన్‌ఫౌండ్రీ: అసోసియేషన్‌ ఆఫ్‌ ఏఈజీ 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఠాగూర్‌ ఆడిటోరియంలో శుక్రవారం కనకదుర్గ నృత్య విభావరి సంస్థ నృత్య ప్రదర్శనలు చేశారు. నాట్య గురువు నిర్మలాప్రభాకర్‌ శిష్యబృందం వివిధ అంశాలపై చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శాస్త్రీయ కళలను ప్రోత్సహించాలని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఐశ్వర్య, సంహిత, సహస్ర, హర్షిణి, కృతిక, తేజస్వి పాల్గొన్నారు.

పతంగి ఎగరవేస్తుండగా కరెంట్‌ షాక్‌: విద్యార్థికి గాయాలు

అబిడ్స్‌: మంగళ్‌హాట్‌ గుఫానగర్‌లో ఓ బాలుడు (12) పతంగి ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఏడో తరగతి చదువుతున్న సుమంత్‌ శుక్రవారం తన ఇంటిపై పతంగి ఎగరవేస్తుండగా అక్కడే ఉన్న వైర్లు తగిలి కరెంట్‌ షాక్‌కు గురై బిల్డింగ్‌ పై కిందపడ్డాడు. కాళ్లకు కాలిన గాయాలు కావడంతో బాలుడిని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కొన్ని నెలలుగా బేగంబజార్‌ విద్యుత్‌శాఖ అధికారులకు 3 ఫేజ్‌ విద్యుత్‌ వైర్లను తొలగించాలని స్థానికులు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆరోపించారు. టీజీఎస్‌పీడీసీఎల్‌ అధికారులపై ఆ శాఖ సీఎండీకి ఫిర్యాదు చేస్తామని స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకుడు శ్రీనివాస్‌ యాదవ్‌ తెలిపారు.

సెట్విన్‌ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

యాకుత్‌పురా: సెట్విన్‌ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా ప్రవేశ పెట్టిన ఎల్పీజీ కోర్సుల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ఎండీ కే. వేణుగోపాల్‌రావు సూచించారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్‌ పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ఎల్పీజీ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మెకానిక్‌ 3 నెలలు, ఎల్పీజీ డెలివరీ బాయ్‌ 2 నెలల పాటు శిక్షణను తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్‌ సౌజన్యంతో నిర్వహిస్తున్నామన్నారు. చార్మినార్‌ మోతీగల్లీ, సికింద్రాబాద్‌, సీతాఫల్‌మండిలోని సెట్విన్‌ కేంద్రాల్లో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు నగరంలోని షోరూంల్లో ఉద్యోగాల కల్పనకై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి వివరాలకు 8142439336, 9010157312 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.